

# మట్టి..పువ్వు

అతనికి చాలా దుఃఖంగా ఉంది.

అప్పుడతను వాయువేగంతో పరుగెడ్తున్న రైల్లో...ఎ.సి. కోచ్‌లో..రాత్రంతా నిద్రపోకుండా..కిటికీ ప్రక్కన కూర్చుని నిరామయంగా అప్పుడే ఉదయిస్తున్న రక్తవర్ణ సూర్యునిలోకి చూస్తూ..,

అతనికి చాలా దుఃఖంగా ఉంది.

పిడికెడు గుండెలో దుఃఖం గర్జిస్తున్న సముద్రంలా ఉంది.. ఉరుముతున్న ఆకాశంలా ఉంది...విజృంభిస్తున్న తుఫానులా ఉంది... నరాల్లోకి ప్రవేశించి శరీరమంతా విస్తరిస్తున్న ఇనిస్తీషియా మత్తులా ఉంది.

ఎదుట ఎర్రగా సూర్యుడు..ఉదయ సూర్యుడు-

'సూర్యుడు చచ్చిపోతాడా?'

మరి నిన్న చచ్చిపోయాడు గదా..చచ్చిపోయేవాడు సూర్యుడెలా

ఔతాడు.?

తన మిత్రుడు, తన హితుడు, తన సహచరుడు, తన ప్రాణం, తన జీవితం..సూర్యం..ఏభై రెండేళ్ళ సూర్యం..సూర్యం నిన్న చచ్చిపోయాడుగదా.,

తను నిన్న చెన్నైలో ఒక జాతీయస్థాయి సెమినార్‌లో 'కీనోట్' అడ్రస్ చేస్తున్నపుడు ఎవరో ఎస్సెమ్మెస్ చేశారు. 'యువర్ ఫ్రెండ్ సూర్యం డైడ్ ఆఫ్ హార్ట్‌అటాక్'..యింకేదో.,

గుండెల్లో అగ్నిపర్వతమే పేలింది..కాని..బందీ తను..జాతీయస్థాయి సింపోజియమ్ రూపకర్త తను. నిర్వాహకుడు తను - ఒకరోజు అంతర్జాతీయ అతిథుల బాధ్యతలను స్వీకరించి సదస్సును నడిపించవలసింది తనే..బాధ్యత..ధర్మం..కర్తవ్యం-

వ్యక్తిగత అంశాలకంటే సామాజిక బాధ్యతలు గొప్పవి కదా.?

మరి స్నేహం..ఆత్మీయత..

సూర్యం చనిపోయాడు గదా..చనిపోయినవాని కడచూపు..మధ్య ఏడువందల ఎనభై కిలోమీటర్ల దూరం..నడుమ ఘనీభవించిన కాలం..

తనిప్పుడేంజేయగలడు..ఎలా సూర్యంను కడసారి చూసుకోగలడు.

సదస్సు రాత్రి ఎనిమిది గంటలకు ముగిసి, స్టేషన్‌కు పరుగెత్తుకొచ్చి, తమిళ్‌నాడు ఎక్స్‌ప్రెస్ నందుకుని..గర్జించే పరుగు..రెండే స్టాప్స్..విజయవాడ, వరంగల్..

సూర్యం శవముంటుందా యింకా..తను చూడగలడా..నిన్ననే దహనసంస్కారాలు జరిగిఉంటాయా.? మొన్న కలిసి..మొన్న నవ్వి..మొన్న వెంట తనతో స్టేషన్‌కొచ్చి, తనకు వీడ్కోలు చెప్పి, తన వెన్నుతట్టిన ఆత్మీయ మిత్రుడు..ఇప్పుడు లేడు..

ఎప్పుడు ఎవరు ఉంటారో..ఎప్పుడు ఎవరు ఉండరో..ఎప్పుడు ఎవరు ఎందుకు ఉండరో..ఎప్పుడు ఏది సత్యమో..ఎప్పుడు ఏది నిత్యమో..?

రైలు కీచుమని శబ్దం చేస్తూ...వరంగల్ స్టేషన్‌లో ఆగి..,

తను పుట్టెడు దుఃఖంతో దిగి..దిగ్గానే బయట తన స్కోడా కారు.. పి.ఎ., డ్రైవర్..అప్పటికే తన భార్య అంజలి ఫోన్ చేసింది ఐదారుసార్లు.

'కారును సూర్యం సార్ ఇంటికి పోనీ'..

పరుగు..పరుగు - నిశ్శబ్దం..నిశ్శబ్దం..కారు పరుగెడుతోంది.

'సార్..సార్ బాడీని నిన్ననే...' డ్రైవర్ అంటున్నాడేదో,

మరో ఐదు నిముషాల్లో కారు సూర్యం యింటిముందాగింది. తను దిగి..లోనికి పరుగెత్తి..

ఆ ప్రాతఃకాలం..దుఃఖం మూర్తీభవించిన ఆ నిశ్శబ్ద కుటీరంవంటి గృహప్రాంగణంలో ..ఎదుటహాల్లో..ఫోటో ఫ్రేమ్‌లో నవ్వుతూ సూర్యం..ఓ ఎర్రని

గులాబీపూల దండ..నిశ్చలంగా వెలుగుతూ ఎదుట ఓ ఎర్రని దీపం

మనుషులు..ఇలా చెప్పా చెయ్యకుండా ఆకస్మాత్తుగా వెళ్ళిపోతారు కదా..చుక్కలు చటుక్కున రాలిపోతాయికదా..చేతిలోనుండి మరో చేయి సర్రున జారిపోతుంది కదా..జీవితమంటే యింతేనా..

ఇప్పుడు ఉండి..మరుక్షణం లేకపోవడం-మనిషి నడుస్తూ నడుస్తూ అలా వెళ్ళిపోయి అంతర్ధానమైపోవడం..నిన్న ఉన్నవాడు ఈ రోజు లేకపోవడం.. వెళ్ళినవాడు తిరిగి రాకపోవడం..జీవితమంటే ఇంతేనా..,మరణమంటేకూడా ఇదేనా.?

ప్చ్..ఏమో..!

*   *   *

అతనారోజు సెలవు పెట్టాడు.

అతని భార్య అంజలి ఎంతో ఆందోళన పడ్తోంది పొద్దటినుండి

అతను స్టేషన్లో దిగి నేరుగా సూర్యం ఇంటికెళ్ళి..కడసారి చూపుకూడా నోచుకోక పోగొట్టుకున్న స్నేహితుని మరణ దుఃఖంతో తిరిగొచ్చిన మరుక్షణం నుండి..ఫోన్ ముందు పెట్టుకుని ఆత్మీయులైన స్నేహితులకందరికీ వరుసగా ఫోన్లు చేసి పలకరిస్తున్నాడు. పిచ్చిపిచ్చిగా, దుఃఖంగా.. పసిపిల్లవానివలె..

కాఫీ తీసుకుని ఆమె వెళ్ళినపుడు మూర్తీభవించిన శోకంలా ఉన్న అతను 'అంజలీ..రేపటివరకు ఎవరు ఉంటారో, ఎవరు ఉండరో..ఈరోజే నా స్నేహితులందర్నీ పలకరిస్తా..' అన్నాడు.

అప్పుడతను అంటుకున్న అడవిలా ఉన్నాడు. గాయపడ్డ బెబ్బులిలా ఉన్నాడు..కదిలిస్తే కన్నీళ్ళొలికే కడలిలా ఉన్నాడు.

రెండు మూడు గంటలు ఎందరెందరికో ఫోన్లుచేసి పలకరించి.. సూర్యం మరణ ప్రస్తావనతో, సహానుభూతితో ముచ్చటించి ప్రవహించిన మనిషి.. స్నానంచేసి, టిఫిన్‌చేసి, స్వయంగా కారును నడుపుకుంటూ...కొందరు దగ్గరి స్నేహితులను వ్యక్తిగతంగా కలుసుకోవాలని బయలుదేరి వెళ్ళాడు.

వెళ్తూ వెళ్తూ..'అంజలీ..ఎందుకో..ఈరోజు ఆత్మీయులందర్నీ కలుసుకోవాలనిపిస్తోంది అంజలీ..చూశావుకదా..నిన్న సూర్యం చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయాడు..రేపటి వరకు ఎవరుంటారో ఉండరో' అన్నాడు.

అంజలి అతనివైపు చిత్రంగా చూచింది..మనిషికి మనిషిస్పర్శ యింత ప్రాణప్రదమైందా అనుకుందామె.

*   *   *

రాత్రి పదిన్నరగంటలకు తిరిగొచ్చాడతను.

'అంజలీ..హృదయం ఎంతో తృప్తిగా ఉందీరోజు' అన్నాడు.

'ఏం' అందామె.

'నగరంలో తెలిసిన అందర్నీ కలిశాను అంజలీ..చిన్ననాటి స్నేహితుల్ని...నన్ను ప్రేమించి పెళ్ళిచేసుకోలేకపోయిన వింధ్యను, నా ప్రమోషన్‌ను అడ్డుకుని నాతో పదిహేనేళ్ళు కోర్టులో పోరాడిన డాక్టర్ మోహన్‌ను..ప్రొఫెషనల్‌గా ఎందరో శత్రువులను..అఫ్టరాల్ అందరూ మనుషులమే కదా అంజలీ.. మనుషులం నాల్గురోజులు జీవించడానికి వచ్చి రేపు వెళ్ళిపోవాల్సిన వాళ్ళం.. ఈ భేషజాలు, కుట్రలు, కుతంత్రాలెందుకు చెప్పు. ఒక చిర్నవ్వు..ఒక వాత్సల్యపూరిత పలకరింత..ఒక స్నేహ స్పర్శ..ఒక..' చెబుతూనే ఉన్నాడు.

అతనిలో ఒక తృప్తి..ఒక ఆనందం..ఒక పరిపూర్ణత..

గ్లాసు పాలు తాగి నిద్రకుపక్రమిస్తూ అతడన్నాడు 'అంజలీ..ఈ రోజు యింతమంది స్నేహితుల్ని కలిసి పలకరించినపుడు అనిపించిన అద్భుతమైన అనుభూతి గురించి చెప్పనా..జస్ట్ మనిషి..బయటికి వెళ్ళి తిరిగి ఇంటికి రావడమంటే జీవించడం..వెళ్ళిన మనిషి తిరిగి ఇంటికి రాకపోవడమే మరణం.. డట్సాల్..ఈరోజు నా ఫ్రెండ్సందరికి ఈ విషయమే చెప్పాను. మనుషులం.. మనం మళ్ళీ ఎప్పుడు కలుసుకుంటామో, మన చేతుల్లో ఏమీలేదని అన్నాను.. ఎందుకో దుఃఖం మేఘంలోకి నీరులా వ్యాపించి విస్తరిస్తోంది అంజలీ...' అని.

అతను ఆక్షణం కొత్తగా..వెలుగుతూ..పరిపూర్ణ మానవునిగా కనబడ్డాడు.

మనిషికి స్నేహం గురించి, పలకరింత గురించి, స్పర్శ గురించి యింత యావ ఉంటుందా అనిపించింది.

తర్వాత ఆమె నిద్రకుపక్రమించింది.

అతనూ నిద్రపోయాడు..ప్రశాంతంగా–

* * *

మర్నాడు

అతను నిద్రలేవలేదు.

అతని స్నేహితుడంటున్నాడు 'ఎందుకో..నిన్ననే వాడు పనిగట్టుకుని వచ్చి అందర్నీ పలకరించిపోయాడు..రేపటివరకు ఎవరుంటారో ఎవరుండరో అనీ అన్నాడు..'

అంజలికి మాటలకందని ఇంకేదో మార్మిక జీవితం గురించి స్పష్టంగా అర్థమౌతోందాక్షణం–

●

'సాక్షి' ఆదివారం అనుబంధం
తేది : 18-01-2009